అడుగులో అడుగేసి నడిచే అర్ధాంగి ముందడుగేసిందంటే.... కారణం యెవరు ?

# బస్సాగింది..... మాంధాత

బస్సాగింది.

చలపతి తను దిగి కుమారిని జాగ్రత్తగా చెయ్యి పట్టుకుని దింపాడు.

రోడ్డుపక్కన వున్న పాన్ షాప్‌కి సిగరెట్ కోసం వెళ్ళాడు.

కుమారి తనుకూడా భర్త వెంట వెళ్ళాలో లేక అక్కడే నిలబడాలో తెలీక అయోమయంగా చూస్తూ నిలబడిపోయింది.

చలపతి సిగరెట్ పెట్టె కొని చాలా నెమ్మదిగా సిగరెట్టు తీసి వెలిగించి పెట్టె జేబులో పెట్టుకుంటూ కుమారి వేపు చూశాడు.

అతనికి నవ్వొచ్చింది.

కుమారి బెదురుగా అతనివేపే చూస్తోంది. చలపతి తాపీగా నడుచుకుంటూ వొచ్చి నడవసాగాడు. కుమారి అతన్ని అనుసరించింది.

"నువ్వు కాఫీ తాగుతావా?"

"మీ యిష్టం."

"అట్లా కాదు- నీకు తాగాలని వుంటే చెప్పు"

"మీకు తాగాలనిపిస్తే యిద్దరం తాగుదాం."

చలపతి సంతోషించాడు.

"సరే పద."

టాంక్‌బండ్ మీద వున్న స్టాల్ వేపు నడిచారు. చలపతి ముందుగా రెండు ప్లేట్లలో సమోసాలు తీసుకువచ్చాడు.

మెడలో పసుపుతాడు. మొహంలో బెదురు, సిగ్గు.

చలపతి నవ్వుకున్నాడు.

గర్వపడ్డాడు.

"ఇవాళతో మారేజికి పెట్టిన లీవ్ అయిపోయింది. రేపు ఆఫీసుకి పోవాలి."

కుమారి ఏమీ మాట్లాడకుండా నోరు నెమ్మదిగా కదుపుతూ తింటోంది.

"రేపు కూడా సెలవు తీసుకోనా పోనీ?"

"మీ ఇష్టం.... సెలవు ఇస్తారా?"

"వాళ్ళ మొహం. వాళ్ళిచ్చేదేమిటి? నేనే తీసుకుంటాను."

"మీ ఇష్టం."

చలపతి సంతోషించాడు.

తినటం అయాక టీ తీసుకొచ్చాడు.


ఒక వ్యక్తి తనమీద యింతగా ఆధారపడటం చలపతికి చాలా సంతోషం కలిగించింది. తనకే తెలియని తన గొప్పతనాన్ని గుర్తించే వ్యక్తి తన ప్రక్కన వుండటం అతనికి చాలా సంతృప్తిని యిచ్చింది.

కొంతదూరం నడిచాక—

"ఇక్కడ కూర్చుందామా?" అని అడిగాడు.

"మీ యిష్టం."

బెంచీమీద కూర్చున్నారు.



చలపతికి ఏం మాట్లాడాలో తెలియలేదు. కాస్సేపు నిశ్శబ్దంగా కూర్చున్నాడు. భార్య వేపు చూశాడు.

దూరంగా నీళ్ళల్లో పోతున్న పడవల్ని చూస్తోంది.

"ఇదే మొదటిసారి కదూ నువ్వు టాంక్ బండ్ చూడటం?"

"ఊహుఁ. నేను మెట్రిక్ చదువుతుండగా ఒక నెల రోజులు ఇక్కడే వున్నా మా అత్తయ్య వాళ్ళింట్లో—అప్పుడన్నీ చూశా."

చలపతి దెబ్బతిన్నాడు.
కాస్సేపు నిశ్శబ్దంగా వున్నాడు.
నీళ్ళు నెమ్మదిగా నలు పెక్కుతున్నాయి.
దూరంగా సూర్యుడు ఎఱ్ఱబడుతున్నాడు.
సిగరెట్టు తీసి వెలిగించాడు.
"వేరుశనక్కాయలు కావాలా ?"
"మీ యిష్టం.... పోనీ తీసుకోండి."
చలపతి సంతోషించాడు.

"సరేగాని. మీవాళ్ళు నన్ను గురించి ఏమనుకున్నారు పెళ్ళిలో—?"
"ఏమీ అనుకోలేదు. కొంచెం కోపం ఎక్కువ అనుకున్నారు."
"ఏడిశారు. ఆత్మ విశ్వాసాన్ని కోపం అనుకుంటే వాళ్ళొట్టి మూర్ఖులన్నమాట. అవునా. కాదా ?"

కుమారి సందేహిస్తూ 'అవును' అన్నది.
చలపతి సంతోషించాడు.
గర్వపడ్డాడు.
"చూశావా ? లేకపోతే వాళ్ళ స్టాండర్డు ఏమిటి ? మీ తమ్ముళ్ళు ఏం పుస్తకాలు చదువుతారు ? చచ్చు ఫిల్మ్ మాగజైన్సు. డిటెక్టివ్ నావెల్సు—యివేగా ? వాళ్ళెప్పుడన్నా మొరేలియా, ఆల్బర్టు కామూ, సార్త్రే—వీళ్ళ పేర్లన్నా విన్నారూ ? అందుకే వాళ్ళ యింటలెక్చువల్ స్టాండర్డు చాలా తక్కువ."

కుమారి అయోమయంగా చూసింది.
"వాళ్ళు అసలేమీ చదవరు" అన్నది.
"అవును. అందుకే వాళ్ళకొక వ్యక్తిత్వం లేదు."
"మీకు చాలా విషయాలు తెలుసు."
చలపతి సంతోషించాడు.
సూర్యుడు వేగంగా దిగిపోతున్నాడు. పిట్టలు ఆకాశంలో పల్టీలు కొడుతున్నాయి.
"నాకుమూఢనమ్మకాలంటే అసహ్యం. ఉదాహరణకి, పెళ్ళిలో ఆ మంత్రాలేమిటి? వాటి అర్థం ఎవడికి తెలుసు? ఆ బ్రాహ్మలకి అది బతుకుతెరువు."
కుమారి అమాయకంగా, ఆరాధనగా చూపింది.
"మీకు ఎన్నో విషయాలు తెలుసు."
చలపతి సంతోషించాడు.
అప్పుడే చలపతి దృష్టి ఆ నలుగురు కుర్రాళ్ళమీదా పడింది.
లేటెస్టు ఫాషన్సులో డ్రెస్ అయారు. చెవులు కనపడని జుట్టు. ఒకళ్ళిద్దరు గాగుల్సు పెట్టుకున్నారు.
చలపతి ఒంటిమీద తేళ్ళూ, జెర్రులూ పాకినట్లయింది. తన బట్టలు చూసుకున్నాడు. అవి అంత మోటుగా లేకపోయినా వాళ్ళ ముందు తనొక కంట్రీ బ్రూట్‌లా కనబడుతున్నాడు.
అతనికి వాళ్ళెవరో తెలియకుండానే వాళ్ళమీద ద్వేషం కలిగింది.

వాళ్ళు నవ్వుకుంటూ, పాటలు పాడుకుంటూ తమవేపే చూస్తున్నారు.

చలపతి కుమారివేపు చూశాడు.

ఆకుపచ్చటి కాశ్మీరుసిల్కు చీరె, ఎఱ్ఱ బోర్డరు. అదే బోర్డరు జాకెట్. మెళ్ళో ముత్యాల దండ.

చలపతికి అశాంతి యెక్కువయింది.

వాళ్ళు వొచ్చి తాము కూర్చున్న బెంచీ సమీపంలో రెయిలింగ్సుకి ఆనుకుని నిలబడ్డారు.

చలపతికి వొళ్ళు మండిపోయింది.

రౌడీలు. ఇంకా ఎక్కడా చోటులేనట్లు ఇక్కడ చచ్చారు.









రూపానికి రూపం-గుణానికి గుణం!

ఫిలిప్స్ వేలియంట్ 4 బ్యాండ్లు
• పుద్ ఫాయిల్ ప్రింటెడ్ గ్రిల్
• స్లైడ్ కంట్రోల్స్
• క్రోమ్ పుష్ బటన్లు
• సులభంగా కరంటుకు మార్చుకోవచ్చు
రూ. 615
ఆడియోవిజన్, ప్రకాశం రోడ్ విజయవాడ—2. ఫోన్ : 76369.
Ganesh




మళ్ళీ కుమారి వేపు చూశాడు.

ఆమె వాళ్ళ తలల మీదగా దూరంగా కనబడుతున్న బిర్లా మందిర్‌ని చూస్తోంది.

"ఏమిటి చూస్తున్నావు ?"

"గుడి."

చలపతి చిరాకుపడ్డాడు. తను నిజంగా గుడివేపే చూస్తున్నా ఆ వెధవలు వాళ్ళనే చూస్తోందని అనుకుంటే—?

"సరేగాని మీ వూరు కబుర్లు చెప్పు."

కుమారి వుత్సాహంగా—

"చూడండి. చూడండి. లైట్ల వెలుతురులో ఎంత బాగుందో గుడి" అన్నది.

చలపతికి ఈసారి కోపం వొచ్చింది.

వాళ్ళు ఏమనుకుంటారు? తను చూపించే ఇంటరెస్టు తమ మీదే అనుకుంటే? తరువాత వెంటబడతారు, ఇల్లు కనుక్కుంటారు— ఛీఛీ.

చలపతి చటుక్కున లేచాడు.

"పోదాం పద. వెళ్ళి వేరే చోట కూర్చుందాం."

కుమారి ఆశ్చర్యంగా చూసింది.

"ఏం, ఇక్కడ బాగానే వుందిగా ?"

"వేరే చోటుకి పోదాంపద."

"ఇక్కడ గుడి బాగా కనబడుతోందండీ, ఇక్కడే కూచుందాం."

చలపతి చాలా దెబ్బతిన్నాడు. ఆ కుర్రాళ్ళవేపు చూశాడు. వాళ్ళు నవ్వుకుంటున్నారు.

వాళ్ళు. దీని మాటలు విని నవ్వుతున్నారు—అనుకున్నాడు. తన భార్య తన మాట విననందుకు క్రుంగిపోయాడు.

నల్లబడే నీళ్ళని చూస్తూ అట్లాగే కూర్చుండిపోయాడు దూరంగా ఏర్‌పోర్ట్ వెలిగి ఆరిపోతోంది.

"ఏమండీ, ఏమండీ."

చలపతి మాట్లాడలేదు.

"ఆ బుడగతామర తీసివెయ్యొచ్చుగదండీ. చూడండి ఎంత అసహ్యంగా వాసన వేస్తోందో."

చలపతి ఏర్‌పోర్టు లైట్‌నే చూస్తున్నాడు.

"ఏమండీ. మాట్లాడరేం ?"

కుమారి బెదురుగా చూసింది.

'పోనీ పదండి వేరేచోట కూర్చుందాం.'

చలపతి ఆ కుర్రవాళ్ళవేపు చూశాడు. వాళ్ళు ఏదో మాట్లాడుకుంటూ పెద్దగా నవ్వుకుంటున్నారు.

"ఏమండీ, మిమ్మల్నే."

కుమారి గొంతు బొంగురుపోయింది.

కళ్ళల్లోనుంచి నీళ్ళు కారుతున్న విషయం గుర్తించలేదు.

"పోనీ ఇంటికి పోదాం."

చలపతి లేచాడు.

రోడ్ క్రాస్ చెయ్యాలి.

చలపతి గబగబా క్రాస్‌చేసి అవతలి వైపుకి వెళ్ళాడు. కుమారి అతని వెనకే పరిగెత్తింది.

బస్‌స్టాపు దగ్గర నిలబడ్డారు.

బస్సువొచ్చి ఆగింది.

"ఏమండీ, ఈ బస్సు పోదా ?"

చలపతి తనని కాదు అన్నట్లు అటు తిరిగాడు.

ఒక్కసారిగా వొళ్ళు వేడెక్కింది.

వాళ్ళు నలుగురూ కబుర్లు చెప్పుకుంటూ యిటువేపే వొస్తున్నారు.

వచ్చి బస్‌స్టాపు దగ్గర నిలబడ్డారు.

హిందీ పాటలు. వల్గర్ జోక్సు. ఇంగ్లీషు బూతులు.

బాస్టర్డ్స్! -అని తిట్టుకున్నాడు చలపతి.

ఇటువంటి రౌడీల దగ్గర్నుంచి పోదాం అంటే రానంటుందీ —

చలపతి చటుక్కున నాలిక కరుచుకున్నాడు.

కుమారి వేపు చూశాడు.

విటుల కోసం ఎదురు చూస్తున్న వేశ్యలాగా కనిపించి ఇంకా అసహ్యం ఎక్కువయింది చలపతికి.

బస్సు వొచ్చింది.

చలపతి గబగబా ఫుట్‌బోర్డుమీద నిలబడ్డ గుంపుని తోసుకుంటూ లోపలికి వెళ్ళిపోయాడు.

బస్సు కదిలింది.

చలపతి కొంచెం వూపిరి పీల్చుకుని పైనుంచి వేలాడే లెదర్ బెల్టు పట్టుకుని కుమారికోసం చూశాడు.

కుమారి లేదు.

చలపతికి గుండె ఆగినట్లయింది.

తోసుకుంటూ ఫుట్ బోర్డు దాకా వెనక్కి వొచ్చాడు.

ఎక్కడా లేదు.

వెంటనే, "హోల్డాన్ హోల్డాన్" అని అరుస్తూ బెల్లు కొట్టాడు.

బస్సు ఆగలేదు.

పైగా కండక్టరు నెమ్మదిగా, 'కోన్ రేవో బెల్ మార్‌నేవాలా సువ్వర్ కీ బచ్చే.' అన్నాడు.

చలపతి వొళ్ళంతా చల్లబడిపోయింది. కాళ్ళు గజగజా వొణకసాగినై. ఆలోచనలు స్తంభించిపోయినై.

లిబర్టీ దగ్గర బస్ ఆగిందే తడవుగా ఒక్కదూకు రోడ్డు మీదకి దూకి టాంక్ బండ్ వేపు పరిగెత్త సాగాడు.

రోడ్డుమీద జనం, బస్సులు, ట్రాఫిక్ అతనికి కలలో నీడల్లా కనిపించినై. కలలో పరుగులా అతనికి తను కదుల్తున్నట్లు లేదు.

రొప్పు, ఆయాసం, గుండె దడ.

బస్‌స్టాపులో కుమారి నిలబడి వెక్కి వెక్కి ఏడుస్తోంది. పక్కన ఆ నలుగురూ నిలబడి మాట్లాడుతున్నారు.

తనని చూస్తూనే కుమారి దగ్గరికి రాబోయి ఆగింది. చలపతి వెళ్ళి కర్చీఫు తీసి యిచ్చాడు. చలపతితో వాళ్ళు చెప్పుకుపోతున్నారు-తను ఎక్కిన బస్సు కదలగానే, కుమారి ఎక్కలేక బస్ వెంట పరిగెత్తటం, చివరికి ఆగిపోవటం ఏడ్చెయ్యటం, తను వెళ్ళి వోదార్చటం, అడ్రసు అడగటం, ఇంతలో చలపతి రావటం— అంతా చాలా వివరంగా హిందీలోనూ, ఇంగ్లీషులోనూ చెప్పుకుపోతున్నారు.

వాళ్ళు దూరంగా జరిగారు.


"భయపడ్డావా? నాకేం తెలుసు, నువ్వు ఎక్కావనుకున్నా. బస్సు కదిలాక చూస్తే నువ్వు కనబడలేదు. బెల్ కొట్టినా ఆపలేదు- చాలా భయంవేసింది. లిబర్టీ దగ్గర్నుంచి ఒకటే పరుగు - ఏం మాట్లాడవు? కోపం వొచ్చిందా?"


కుమారి మాట్లాడకుండా వెండిలా చీకట్లో మెరుస్తున్న బిర్లా మందిర్‌ని చూస్తోంది.

ఆమె కళ్ళలో తడిలేదు.

చలపతి అయోమయంగా చూశాడు.

టాంక్ బండ్ రోడ్‌కి అటూ, యిటూ వున్న లైట్లు రోడ్డునిమాత్రం వెలిగిస్తున్నాయి. మనుష్యులు చీకటిగా, మసకగా, నిర్జీవంగా వున్నారు.




"మళ్ళీ రేపుకూడా వొద్దామా యిక్కడికి?" అడిగాడు చలపతి.

"వొద్దు."

చలపతి బిక్కమొహంతో చూశాడు.

బస్ వచ్చింది.

అది తమ బస్సు కాదు.

"ఈ బస్సు మనది కాదా?" అని అడుగుతుందేమోనని కుమారి మొహం వేపు చూశాడు.

కుమారి గుడివేపే చూస్తోంది.

చలపతికి భయం వేసింది.

"ఏమిటి ఆలోచిస్తున్నావు?"

"ఏమీలేదు."

తమ బస్సు వొచ్చింది.

కుమారి చకచకా ఫుట్ బోర్డు మీద నిలబడ్డ జనాన్ని తోసుకుంటూ లోపలకి ఎక్కేసింది.

చలపతి కలలో నడుస్తున్నట్లు బస్ ఎక్కాడు.

కుమారి వేపు చూశాడు.

కదుల్తున్న బస్ కిటికీలోంచి బిర్లా మందిర్‌ని చూస్తోంది.

చలపతికి ఏదో అమూల్యమైన వస్తువు పోగొట్టుకున్నట్లు గుండెలు బరువెక్కనై. ●

